www.ssa.ap.gov.in
www.cse.ap.gov.in

# ఆదర్శ

సర్వశిక్షా అభియాన్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

మే - జూన్, 2016
ద్విమాస వార్తా లేఖ
సంచిక : 1

మన రాష్ట్రాన్ని ఒక 'నాలెడ్జ్ స్టేట్'గా, ఎడ్యుకేషన్ హబ్ 'గా మార్చడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోంది. గౌరవనీయులైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్ అనేక కార్యక్రమాలు చేస్తున్నాయి. పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాయి. ఏ ఇతర పాఠశాలకు తక్కువ కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలను తీర్చిదిద్దుతున్నాయి. ఈ ఏడాది నంచి ప్రారంభమైన ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీషు కోసం ప్రత్యేకంగా ఒక సుశిక్షితుడైన ఉపాధ్యాయుడి నియామకం, అదనపు తరగతి గదులు, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, విశాలమైన ఆట మైదానం, ప్రహరి గోడ, బాలబాలికలకు విడివిడిగా మరుగుదొడ్లు, నిరంతర నీటి సరఫరా, మంచి నీటి వసతి, పరిశుభ్రత, గ్రంథాలయం ఇలా.. ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నాయి. నడుస్తున్న ఈ టెక్నాలజీ కాలంలో పిల్లలు వెనకబడకుండా వారికోసం డిజిటల్ క్లాసులను ప్రారంభించాయి. దృశ్య, శ్రవ్య మాధ్యమాల ద్వారా పాఠాలు బోధిస్తున్నాయి. ఈ -అటెండెన్స్ విధానాన్ని పరిచయం చేశాయి. పిల్లలకు పెడుతున్న పౌష్టిక ఆహారంలో ఎలాంటి లోపం లేకుండా ఉండేందుకు ఆన్‌లైన్ పర్యవేక్షణ విధానాన్ని, కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేశాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండాలి, అందుకే 'వ్యాయామ విద్య' (ఫిజికల్ లిటరసీ)ను అందిస్తున్నాం. ప్రతి పాఠశాలలో నీటి సంరక్షణ కోసం ఒక ఇంకుడు గుంతను తవ్విస్తున్నాం. రేపటి విద్యావంతమైన. ఆరోగ్యవంతమైన, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దాం.. ప్రగతి సాధిద్దాం....! నిత్యం మీ సలహా, సహకారాలను ఆశిస్తూ... మీ...

**జి. శ్రీనివాస్,** ఐఏఎస్
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సర్వశిక్షా అభియాన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

# 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల హవా




మే 10, 2016 న విశాఖలో పదోతరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేసిన రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు

ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించారు. ఇతర పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు తాము ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారు. మొత్తం 6, 52, 374 మంది పరీక్షలు రాస్తే అందులో 6, 17, 030 మంది రెగ్యులర్ విద్యార్థులున్నారు. మిగిలిన 35, 344 మంది ప్రయివేటుగా రాసినవాళ్లు. ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల్లో మొత్తం 97. 58 శాతం మంది ఉత్తీర్ణత సాధిస్తే ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఆదర్శపాఠశాలలు 96.52 శాతం ఫలితాలు సాధించి రెండవ స్థానంలో నిలిచాయి. అంటే కేవలం 1శాతం తేడాతో అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ఇక 93.35 శాతం ఫలితాలు సాధించి జిల్లా పరిషత్ పాఠశాలలు మూడోస్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలు 90.31 శాతం, మున్సిపల్ పాఠశాలలు 89. 25 శాతం ఫలితాలు సాధించాయి.

**చదువుల తల్లులు :**

ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాలలన్నింటిలోనూ బాలురు 94.30 శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 94.77 శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో ఉన్నారు. కేవలం ఒక ప్రయివేటు పాఠశాలల విషయంలో చూసుకున్నా బాలురు (97.28శాతం) మీద బాలికలు (97.99) పైచేయి సాధించారు. అయితే మొత్తం ఫలితాల్లో రెండవ స్థానంలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో మాత్రం బాలురు (96.57శాతం) ఒక శాతం తేడాతో బాలికల (96.47 శాతం) మీద ముందంజలో ఉన్నారు.

# సత్తా చాటిన కస్తూర్బాగాంధీ విద్యాలయాలు





*మే 17, 2016 న హైదరాబాద్‌లోని నోవాటల్ హోటల్‌లో బధిర విద్యార్థిని జి. నాగలక్ష్మిని సన్మానిస్తున్న రాష్ట్రమానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు*

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో కస్తూర్బాగాంధీ విద్యాలయాల బాలికలు విజయపతాక ఎగురవేశారు. మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 352 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ఉంటే పదవతరగతి చదువుతున్నవారు 11,606 మంది ఉన్నారు. వీరిలో 11,565 మంది పరీక్షలకు హాజరైతే పాసైన వారు 10,901 మంది. అంటే 94.26 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష రాసిందే 11, 565 మంది ఉంటే ఇందులో ఏ1 గ్రేడ్ సాధించినవాళ్లు 501 మంది. ఇక పదికి పది జిపిఏ సాధించినవాళ్లు ఐదుగురుంటే వారిలో ఒకరు బధిర (మూగ, చెవిటి) విద్యార్థిని. కడపజిల్లా బ్రహ్మంగారిమఠం కేజీబివిలో చదివిన జి. నాగలక్ష్మి పుట్టుకతోనే మూగ, చెవుడు. తల్లిదండ్రులు దినసరి కూలీలవడంతో మధ్యలోనే చదువు మానేసింది. సర్వశిక్షా అభియాన్ అధికారులు ఆ అమ్మాయిని గుర్తించి బ్రహ్మంగారి మఠం కేజీబివిలో చేర్చారు. ఇద్దరు సమ్మిళిత విద్యా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా నియమించి నాగలక్ష్మికి ప్రత్యేక బోధనోపకరణాల ద్వారా శిక్షణ ఇప్పించారు. దీంతో నాగలక్ష్మి పదోతరగతి పరీక్షల్లో పదికి పది జిపిఏ సాధించింది. ఈ విషయాన్ని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు అధికారులు. దీంతో మంత్రి స్పందించి ఆ చిన్నారిని మే 17న హైదరాబాద్ పిలిపించి అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, కమిషనర్ కె. సంధ్యారాణి, కేజీబివి జేఎస్ కుమార్, ఎస్‌సి మాల్యాద్రి, కడపజిల్లా జిసిడివో సునీత , సీమ్యాట్ లెక్చరర్ సతీష్‌రెడ్డి పలువురు టిఎస్‌జి కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

## ఫలితాల్లోనూ ఆదర్శం

పేరుకు తగ్గట్టే పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూల్స్) ఆదర్శంగా నిలిచాయి. మొత్తం ఫలితాల్లో ప్రయివేటు పాఠశాలలు 97.58 శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో ఉంటే 96.52 శాతంతో ఆదర్శపాఠశాలలు రెండో స్థానం దక్కించు కున్నాయి. అంటే కేవలం 1.06 శాతం తేడాతో ఆదర్శపాఠశాలలు ఈసారి విజయదుందుభి మోగించాయి. మొత్తం 150 పాఠశాలలు ఉంటే వందశాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు 66 ఉన్నాయి. ఇక 91 నుంచి 100 శాతం మధ్యలో ఫలితాలు సాధించిన పాఠశాలలు 70 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ ఆదర్శపాఠశాలలను నడుపుతోంది. ఆరు నుంచి ఇంటర్మీడియెట్ దాక ఇందులో ఇంగ్లీషు మీడియంలో బోధన ఉంటుంది. ఈసారి ఆదర్శపాఠశాలలు పదవతరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానం సాధించాలని కోరుకుందాం.




# ఈ ఏడాది నుంచి కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్ విద్య

పదవ తరగతి పూర్తయిన తర్వాత బాలికలు ఇంటర్మీడియెట్ విద్య కోసం ఇకముందు ఇబ్బందులు పడక్కర్లేదు. కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోనే ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ విద్యను ప్రవేశపెడుతున్నారు. మొదటి విడతలో జిల్లాకొకటి చొప్పున 13 కాలేజీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులోని సాధకబాధకాలను తెలుసుకున్న తర్వాత వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో దాదాపు వంద కాలేజీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతానికి ఎంపిసి, బైపిసి గ్రూపులతో కాలేజీలను ప్రారంభిస్తున్నారు.




జిల్లాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నచోట మాత్రమే కాలేజీలను ఏర్పాటు చేసి, విద్యార్థినులకు ఇబ్బందులేవీ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎంపిసి, బైపిసి సబ్జెక్టులను బోధించడానికి అధికారులు పార్ట్ టైం ఉద్యోగులను తీసుకోనున్నారు. వీలైనంత త్వరలో ఈ ఇంటర్మీడియెట్ విద్యకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులూ, విధివిధానాలు వెలువరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## చిత్తూరులో 'బచ్‌పన్ బచావో'

పేరుకు వేసవి సెలవలే కానీ పల్లెల్లో చాలాచోట్ల తల్లిదండ్రులు పిల్లల్ని పనులకు పంపుతుంటారు. దీన్ని గమనించిన చిత్తూరు జిల్లా కలెక్టర్ సిద్ధార్థ జైన్, సర్వశిక్షా అభియాన్ అధికారులు 'బచ్‌పన్ బచావో' పేరుతో వేసవి శిబిరాలను ఏర్పాటు చేశారు. వేసవిలో కూడా మధ్యాహ్నభోజన పథకం అమల్లో ఉంది కాబట్టి పిల్లలందర్నీ రప్పించి ఆటపాటలను నేర్పారు. మనం మర్చిపోతున్న గ్రామీణ ఆటలూ, కళలూ, ఆత్మరక్షణ విద్యవంటివెన్నో నేర్పించి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. అంతేకాదు చిత్తూరు జిల్లా సర్వశిక్షా అభియాన్ అధికారులు ఈ వేసవి శిబిరాలు నడిచిన తీరుపై ఒక వీడియో తయారు చేసి యూట్యూబ్‌లో పెట్టారు. ఈ లంకెను తప్పక చూడండి :

https://www.youtube.com/watch?v=LV8BZUcswJg

# బాలికావిద్యకు మరింత ప్రోత్సాహం

పాఠశాల విద్యాశాఖ బాలికావిద్యకు మరింత ప్రోత్సాహం అందించనుంది. ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ పాఠశాల విద్యాశాఖలో విలీనమైన సందర్భంగా ఆ సంస్థ సభ్యులతో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశమై భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ సభ్యుల సేవలను పాఠశాల విద్యాశాఖలో ఎలా వినియోగించుకోవాలనే అంశంపై చర్చించారు.

బాలురతో సమానంగా బాలికలు కూడా పాఠశాలలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలనీ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా సూచించారు. స్త్రీ అక్షరాస్యత విషయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమతా సొసైటీ ఇదివరకే మంచి ఫలితాలు సాధించిందని ఆర్పీ సిసోడియా అభినందించారు. అలాగే పాఠశాల విద్యాశాఖకమిషనర్ కె. సంధ్యారాణి మాట్లాడుతూ సమతా సొసైటీ సభ్యులు విద్యాశాఖతో కలసి పనిచేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. ముఖ్యంగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుపై శ్రద్ధపెట్టాలని సూచించారు. పాఠశాలల్లో బాల బాలికల నమోదుశాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ మేరకు మన రాష్ట్రం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అదరికీ ఆదర్శంగా ఉండేలా పని చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఈక్విటీ కన్సల్టెంట్ (టిఎస్‌జి) పి. గీత సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కేజిబివి జెఎస్ ఎంఎల్ కుమార్, ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్ పుల్లయ్య, అన్ని జిల్లాల బాలికా సంరక్షణా అధికారులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, టిఎస్‌జి కన్సల్టెంట్లు పాల్గొన్నారు.



*మే 11న పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా సమతా సొసైటీ సమావేశం.*

***రిపోర్ట్ : నాగరాజు, సిఎంఓ కన్సల్టెంట్, పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్.***

# డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పాత్రికేయ పురస్కార విజేతలు వీరే

తెలుగు పత్రికా రంగంలో ఇచ్చే ఉత్తమ విద్యారంగ వార్తా పురస్కారం కోసం కృష్ణాజిల్లాకు చెందిన పాత్రికేయులు వీరంకి యజ్ఞనారాయణ (ఈనాడు) ఎంపికయ్యారు. అలాగే ఆంగ్లపత్రికా విభాగంలో ఇచ్చే పురస్కారానికి విశాఖపట్నానికి చెందిన ఉమామహేశ్వరావు (దెక్కన్ క్రానికల్) ఎంపికయ్యారు. తెలుగు టీవీ పాత్రికేయ రంగంలో ఇచ్చే పురస్కారం కోసం హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయులు సతీష్ బెల్లంకొండ (టెన్‌టీవీ) ఎంపికయ్యారు. ఈ ఏడాది తెలుగు విభాగంలో ఇవ్వతలపెట్టిన ప్రోత్సాహక బహుమతికోసం సీనియర్ జర్నలిస్టు పి. వేంకటేశ్వర్లు (ఆంధ్రజ్యోతి) ఎంపికయ్యారు. త్వరలోనే విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.



సతీష్



ఉమామహేశ్వరావు



యజ్ఞనారాయణ



పి. వేంకటేశ్వర్లు





*గుంటూరులో శిక్షణా తరగతుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు.*



*పుల్లెల గోపీచంద్‌తో 'స్పోర్ట్స్ ఫర్ లైఫ్' సంస్థ ప్రతినిధి రిచర్డ్స్.*

# వ్యాయామ విద్యకు అంకురార్పణ

వ్యాయామ విద్యను అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేసి రేపటి పౌరులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులకు మేనెల 3 నుంచి 10వ తేదీ వరకు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 731 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యారు. కెనడాకు చెందిన 'స్పోర్ట్స్ ఫర్ లైఫ్', బ్రిటన్‌కు చెందిన ఐపిఎల్ఏ (ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్) అలాగే ఇషా ఫౌండేషన్ సంస్థలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాయి. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. **వ్యాయామ విద్యపై ఈ తరహా శిక్షణా తరగతులు నిర్వహించడం దేశంలోనే ఇది మొదటిసారి.**

మే 3న ఉదయం పదిన్నరకు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ శిక్షణా తరగతులను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడారు. పిల్లలకు చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని అందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. వారానికి ఆరు గంటలు ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు వ్యాయామ విద్యను బోధించాలని మంత్రి పిలుపునిచ్చారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో వ్యాయామ విద్యను విధిగా బోధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రఖ్యాత క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ వ్యాయామ విద్యపట్ల పిల్లలూ, తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శారీరకంగా, మానసికంగా పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే చదువు మీద శ్రద్ధ పెట్టగలుగుతారని చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ ఆర్పీ సిసోడియా, కమిషనర్ కె. సంధ్యారాణి, ఎమ్మెల్సీ రామకృష్ణ, శాప్ ఛైర్మన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ వారం రోజుల శిక్షణా తరగతుల్లో ముఖ్యంగా పాఠ్యాంశాల రూపకల్పన, పౌష్టిక ఆహారం, మానవతా విలువలు, క్రీడల ప్రాముఖ్యత వంటి విషయాలమీద దృష్టిపెట్టారు. వ్యాయామ విద్యను ప్రత్యేక అవసరాలున్న పిల్లలక్కూడా బోధించాలని వారికోసం కూడా ప్రత్యేకంగా పాఠ్యాంశాలను రూపొందించాలని నిర్ణయించారు. యోగాకు సంబంధించిన ప్రాధాన్యతను కూడా ఉపాధ్యాయులకు వివరించారు. వ్యాయామ విద్యకు సంబంధించి వార్షిక పరీక్షల్లో ప్రశ్నలిచ్చి మార్కులు వేసేందుకు కూడా విధివిధానాలు రూపొందిస్తున్నారు.

**రిపోర్టు : పి. వెంకటేశ్వరరావు, జనరల్ కన్సల్టెంట్, టి.ఎస్.జి.**








## చదువుల తోటలో సీతాకోక చిలుకలు

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ వార్షికోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీల్లో పాల్గొని బహుమతులు పొందారు. ఎప్పుడూ చదువుతో కుస్తీ పట్టే పిల్లలు అప్పుడప్పుడు ఇలా ఒకచోట చేరి సందడి చేస్తే ఆ ఆహ్లాదం ఎలా ఉంటుందో ఇక వేరే చెప్పనక్కర్లేదు కదా.

***రిపోర్టు : వి. గీత, ఈక్విటీ కన్సల్టెంట్, టి.ఎస్.జి.***



మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు
ఈ అడ్రెస్‌కు తెలియజేయండి...

**ఆదర్శ,**
రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం,
సర్వశిక్షా అభియాన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.
ఎల్.బి. స్టేడియం ఎదురుగా, హైదరాబాద్-01
ఫోన్ : 7702611556, apssamedia@gmail.com